# ఆయమ్మో-ఆయమ్మే

**“అబ్బబ్బ! ఈ అమెరికాలో దేనితోటైనా సర్దుకు పోవచ్చుకానీ, ఈ తొడుగులతోటి కాదు. పచ్చిమిరపకాయలకి బయటికి వెళ్లాలన్నా ఈ తొడుగులు తప్పటంలేదు” కాళ్ళకి సాక్సూ,బూట్లూ తొడుక్కుంటూ విసుక్కుంది వినోదిని.**

“సరే...సరే...! నీ సణుగుళ్ళు సరేకానీ ప్రతిమా – ప్రదీపులు ఏరీ? తయారయ్యారా లేదా?” చేతులకి గ్లవుజ్ వేసుకుంటూ అన్నాడు కిశోర్.

“ఏం...! మీరు కొంచెం చూసుకోవచ్చుగా! అన్నింటికి నేనే చావాలా? ఇంతకు ముందే బట్టలేసి వదిలాను. బహుశా డెక్‌లో వున్నారేమో!” షాల్ కోసం బెడ్‌రూముకేసి నడుస్తూ అంది వినోదిని.

“ఏయ్ ప్రీతూ...! దీపూ...!” కిశోర్ కేకలకి పరుగెత్తుకొచ్చారు ఆరేళ్ళ ప్రతిమ, నాలుగేళ్ళ ప్రదీప్. ఇద్దరూ ఎస్కిమో బేబీల్లాగ వున్నారు పూర్తిగా వులన్ బట్టలతో కవరయ్.

తయారై నిల్చున్న వినోదిణ్ణి చూసి,

“విన్నూ..! ప్రభాకర్‌గారింట్లో కదా ఈ రోజు పాట్‌లక్ డిన్నర్. నువ్వేమేం చేస్తున్నావేంటి?” అన్నాడు, కిశోర్.

“ఇవాళ వాళ్ళమ్మాయి శ్రుతి పుట్టినరోజు కదా... మరచిపోయారా? మనమేం చేసి తీస్కెళ్ళక్కరలేదు” అంది వినోదిని.

“ఓకే.. ఓకే.. విజయగారి కెలాగయిన చాలా ఓపిక విన్నూ! మొన్నటికి మొన్న వాళ్ళ వెడ్డింగ్ ఆనివర్సరీకి ఎంత మంచి డిన్నరు ఇచ్చారు. ఎన్ని అయిటమ్స్ పెట్టారు. వెజిటేరియన్... నాన్ వెజిటేరియన్ కూడా కదూ...!” అన్నాడు కిశోర్.

“ఔన్లెండి! మీ కెప్పుడూ పరాయివాళ్ళని మెచ్చుకోవడంతోటే సరిపోతుంది. నాకు కూడా విజయగారింట్లో వుంటున్న కేర్‌టేకర్–కం–కుక్ లాంటి ఆవిడ వుంటే నేను కూడా విజయ కన్నా బ్రహ్మాండంగా విందులిచ్చేదాన్ని. నాకూ బ్రహ్మరథం పట్టేవారందరూ...!” కార్లో ఎక్కి కూర్చునేవరకూ సాధిస్తూనే వుంది వినోదిని.

ఆవిడగారి వాగ్ధాటికి అలవాటుపడ్డ ప్రాణం కిశోర్‌ది. నవ్వుకుంటూ కారును ముందుకు పరుగెత్తించాడు.

ప్రభాకర్ గారింటికి వెళ్ళీ వెళ్ళడంతోటే ప్రతిమ, ప్రదీప్ పోర్టికోలో వెయిట్ చేస్తున్న విజయ పిల్లలతో కలిసి ఎటో మాయమయ్యారు.

“హలో...డాక్టర్.. రండి... మీ కోసమే వెయిట్ చేస్తున్నాను..” కిశోర్‌ని బేస్మెంట్ ఫ్లోర్‌కి లీడ్ చేస్తూ అన్నాడు ప్రభాకర్ – విజయ భర్త.

అప్పటికే, లివింగ్ రూములో చేరి విజయ, ప్రఫుల్ల, హారతి కబుర్లు చెప్పకుంటున్నారు. వాళ్ళని సమీపించింది వినోదిని.

“ఏంటండీ వినోదినిగారూ...! అరగంట జర్నీ లేదు కదా మీ ఇంటి నుండి మా ఇంటికీ.. ఇంత లేటా? మిగతా వాళ్ళే నయం. దూరం నుండయినా తొందరగా వచ్చారు..” విజయ, వినోదిన్ని దెప్పింది.

“ఏం చెయ్యమంటారు చెప్పండి? అన్నిటికీ నే నొక్కదాన్నే కదా! మావారికి హాస్పిటల్ ఫస్ట్ వైఫ్. ఆవిడ అనుమతి లేనిదే ఇంటికి కూడా రారు ఈయనగారు”.

వినోదిని మాటలకు మిగిలినవారు ఫక్కున నవ్వారు.

“ఎంతయినా విజయ చాలా లక్కీ అండీ! ఎన్ని పార్టీలయినా ఇవ్వగలరు ఒళ్ళు అలవకుండా. మనలాగా కాదు కదా! మనకయితే రెండే చేతులు. విజయగారి కయితే అదనంగా ఆయమ్మగారి చేతులు కూడా వున్నాయి కదా...!” ప్రఫుల్ల విసురు.

“నిజమేనండోయ్! దేనికయినా పెట్టిపుట్టాలి. విజయ ఎప్పుడు ఫోన్ చేసినా ... ఆయమ్మగారి వంటల్ని... పద్ధతుల్ని పొగుడుతూనే వుంటారు” అందుకుంది హారతి.

డిన్నర్ టైం అవటంతో అందరూ డైనింగ్ హాలుకేసి నడిచారు.

* * *

భోజనాలయ్యి అందరూ వెళ్ళిపోయినా, ఆటల్లోపడ్డ ప్రదీప్, ప్రతిమలు ఇంకో అరగంటంటూ మొరాయించడంతో, కిశోర్–ప్రభాకర్లు టీవీ చూడ్డంలోను – వినోదిని, విజయలు మాటల్లోనూ పడ్డారు.

వినోదిని మెల్లగా విజయని కదిపింది, “విజయా! మిమ్మల్నెప్పటి నుండో అడగాలని అనుకుంటున్నాను. ఆయమ్మ... ఆయమ్మ... అంటారు కదా! ఆవిడ మీకేమౌతారు...? ఆవిడని పరిచయమే చెయ్యలేదు.”

“ఓ .. కదూ... సాయంత్రం నుండి ఆమెకి కొద్దిగా ఫీవరిష్‌గా వుంది. అందుకే గెస్ట్ రూంలో రెస్ట్ తీసుకుంటున్నారు” అంది విజయ.

“ఉహు! కేర్–టేకర్ కయినా బాగానే సౌకర్యాలు కల్గించినట్లున్నారే!”

“అలా అనకండి వినోదినీ! పని చేయడానికి వచ్చిన. మనిషిలా అన్పించడం లేదు మాకు. నా కన్నతల్లి అని నేనంటే – అదేంటి – నన్ను కన్నతల్లి కాదా! అంటారు మావారు. ఎంతో ఆప్యాయంగా వుంటారు మాతోటి.”

“ఔనా! నిజంగా అంత మంచి మనిషి దొరకడం చాలా గ్రేటే! అసలు ఆవిడ మీకెలా పరిచయమయ్యారు..?”

“అదో పెద్ద గమ్మత్తండి! వరంగల్ ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మా మరిది రమేష్‌కి చెప్పి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని దినపత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్ ఇప్పించాం, ఓ తెలుగు వనిత కావాలంటూ...

అమెరికాలోని న్యూజెర్సీలో డాక్టరుగా పనిచేస్తున్న ఆంధ్రుల ఇంట్లో పిల్లల్ని చూసుకోడానికి – ఇల్లాలికి సాయపడేందుకు సాంప్రదాయమైన కుటుంబం నుంచి వచ్చి, నమ్మకమైన, ఏ బాదరాబందీ లేని మధ్యవయస్కురాలైన స్త్రీ

ఎం. హేమలత

కావాలంటూ...

అడ్వర్టైజ్‌మెంట్ ఆన్సర్ చేసిన అనేకమందిలో ఈమెను సెలెక్ట్ చేసి పంపాడు మా మరిది. పాపం! ఈవిడ చాలా మంచివారు. బాగా బ్రతికి చెడినట్లున్నారు. కాస్త దైవభక్తి ఎక్కువ. ఆవిడ ఆచారాలకి మనం అడ్డురానంతవరకు ఆవిడ హాపీ... మనం హాపీ.

"కండిషన్స్ పెట్టిందా.. ఏమిటి?" వినోదిని మాటల్లో కాసింత కోపం.

"అసలు ఆవిడని చూస్తేనే పూజ్యభావం కలుగుతుంది. మా అత్తగారో – మా అమ్మగారో ఇంట్లో తిరుగుతున్నట్లు వుంటుంది. ఇక కండిషన్స్ దేముంది? ఆమె మాటకి ఎదురేలేదనుకో..ఔను.. వినోదినీ! అన్నట్లు మీరు కూడా మనిషి కోసం చూస్తున్నారు కదా! మాలాగా అడ్వర్టైజ్ చేయవచ్చేమో..!"

"సరేలే! అందరూ మీ ఆయమ్మ లాగా వుండొద్దూ..! ఇంతెందుకు మా అత్తగారు వున్నారు వరంగల్ దగ్గరున్న ఖాజీపేటలో. ఆవిడగార్ని రమ్మంటే ఇక్కడికి వస్తారా? వచ్చినా ఈ వాతావరణంలో ఇమడగలరా?" వినోదిని మాటలకు అడ్డుతగుల్తూ "విన్నా..! ఇక పోదామా చాలా లేటయింది..." అంటూ వచ్చాడు కిశోర్.

**వేలు**

జెనో అనే ఆయన ప్రముఖ వేదాంతి. 98 సంవత్సరాల వయస్సులో జెనో ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు కారణం ఆయన వేలొకటి విపరీతంగా నొప్పి పెట్టడమే! – కొడిమెల

"అలాగే పోదాం – కానీ – ఈ కబురు విన్నారా? విజయా వాళ్ళు పేపర్‌లో అడ్వర్టైజ్ చేస్తే – వాళ్ళకి మంచి పనిమనిషి దొరికిందట..." అంది వినోదిని.

"ఔను కిశోర్! మా ఆయమ్మ నిజంగా ఎక్సెప్షన్ అనుకో! ఆవిడ పని.. లేకుంటే పిల్లలతో కాలక్షేపం. చాలా క్వయట్ టైప్. ఆవిడ ఫ్యామిలీ విషయాలు కూడా డిస్కస్ చేయరు..." ప్రభాకర్ మాటలకి "ఇక ఈయన మొదలు కాబోలు ఆయమ్మను స్తుతించడానికి" – అయిష్టంగా ముఖం పెట్టింది వినోదిని.

"మీ ఇద్దరికీ ప్రేమపాత్రురాలయిన ఆ చల్లని తల్లిని ఓమారు చూడాలని వుంది ప్రభాకర్..." అన్నాడు కిశోర్.

"ఆయమ్మ జ్వరంగా వుందని పడుకున్నారండీ! లేకుంటే పరిచయం చేసేవాణ్ణి" విజయ మాటలు విజయనోట్లో వుండగానే పెద్ద పెట్టున ప్రదీప్ ఏడ్పు వినిపించింది.

"మేడ మీదికి ఎప్పుడెళ్ళాడు వీడు..?" అంటూ మెట్లపై పరుగుతీసాడు కిశోర్. అప్పటికే సగం మెట్లు దిగిన ఆయమ్మ చేతిలో ప్రదీప్!

ప్రదీప్‌ని ఆ అమ్మ చేతులలో చూసిన కిశోర్ అవాక్కయ్యాడు. భర్త వెనకే మెట్లు ఎక్కిన వినోదిన్ని చూసిన ఆయమ్మ పిల్లవాణ్ణి కిశోర్ దగ్గర వదలి గిరుక్కున వెనుదిరిగింది.

వెక్కిళ్ళు పెడుతున్న తనయున్ని ఎత్తుకోవాలని కూడా తోచని వినోదిని అప్రతిభురాలయి నిలబడిపోయింది!

తను ఇన్నేళ్ళుగా తలవని కన్నతల్లిని ఆయమ్మగా పరాయి ఇంట చూసిన కిశోర్ హృదయం లజ్జతో, అవమానభారంతో, దుఃఖంతో అతలాకుతలమై అంతులేని ఆవేదనతో అలమటించింది. ●

